ముందుమాట

ఇప్పుడు పరిస్థితి కొంచెం మారిందేమోగానీ ఈ ప్రచురణలోని కరపత్రాలు అచ్చువేసిన రోజులలో మహబూబ్‌నగర్ జిల్లాలో ఏడవ నంబర్ జాతీయ రహదారిని మినహాయించి వేరే ఏ రోడ్డుపైన ప్రయాణం చేసినా, ఒక అర్ధగంట గడిచేటప్పటికి ఈ ప్రపంచంలో మనమూ నాలుగు మేకలూ తప్ప వేరెవరూ లేరన్న అనుభూతి కలిగేది. ఈ క్షణం ప్రళయం వచ్చి తక్కిన ప్రపంచమంతా మునిగిపోయినా మనకసలు తెలియదేమో అనిపించేది. సాయంత్రమయితే, స్కూటర్ వెనక కూర్చున్న మనిషి భయస్తుడయితే 'ఇవాళ్టికి ఆగుదాంలెండి, రేపు పోదాం' అనడం, పిరికితనం అనుకుంటారన్న భయం లేకపోతే మనమూ అదే హితం అనుకోవడం జరిగేది.

వెనుకబాటుతనానికి శాస్త్రీయ సూచికలు అనేకం ఉంటాయి. శాస్త్రీయ విశ్లేషణకు అవి అవసరమే, సందేహం లేదు. కాని ఒక ప్రాంతపు వెనుకబాటుతనాన్ని అనుభూతి చెందడానికి ఆ సూచికలు, వాటిని ఆధారం చేసుకున్న నివేదికలు అవసరం లేదు. నిర్మానుష్యమైన బయలు ప్రదేశాలు, కంపచెట్లు తప్ప మరొక వృక్షజాతి సృష్టిలో లేదనిపించే బీడు భూములు, తెల్లబట్టలవాళ్లు మంచివాళ్లే అయి ఉంటారని విశ్వసించే అమాయకపు చూపులు, ప్రభుత్వం ఏ కొంచెం చేసినా అదే పదివేలు అనుకునే అల్పసంతోషం, గురితప్పకుండ అది వెనుకబడిన ప్రాంతం అని సూచిస్తాయి.

అభివృద్ధి వికృతరూపం తీసుకుంటున్న ఈ రోజులలో వెనుకబాటుతనాన్ని గురించి ఆందోళన వ్యక్తం చేసే ముందు కొంచెం సంజాయిషీ అవసరం. ప్రకృతిని ధ్వంసం చేయకుండ, మనుషులకు దానిని దూరం చేయకుండ, దాని ఫలసాయాన్ని పెంచే చర్యలు అభిలషించదగ్గ అభివృద్ధే. పొలాలకు నీటి వసతి కల్పించడం, భూసారాన్ని కాపాడడం, బంజర్లలోనూ అడవులలోనూ జీవనానికి ఉపయోగపడే వనరులను పెంపొందించడం, వ్యవసాయానికి అనుబంధమైన పశుపోషణకు ఊతమివ్వడం ఈ కోవలోకి వస్తాయి. పిల్లలకు చదువు, అందరికీ ఆరోగ్యం, నివాసం, రవాణా సదుపాయాలు, స్థానిక మార్కెట్ల అభివృద్ధి, రోగనివారణకు అవసరమైన పారిశుధ్యం కూడ కాంక్షనీయమైన అభివృద్ధి కిందికే వస్తాయి. వ్యవసాయాన్నీ గ్రామీణ జీవిత వనరులనూ అభివృద్ధి చేస్తూ, అవి ఇముడ్చుకోలేని జనాభాకు ప్రత్యామ్నాయ జీవనాధారం కల్పించే పారిశ్రామీకరణ కూడ వాంఛనీయమైన అభివృద్ధే.

ఇటువంటి అభివృద్ధిని ఒక హక్కుగా గుర్తించి, అది అందని జిల్లాలలో ఒకటయిన మహబూబ్‌నగర్‌ను కార్యక్షేత్రంగా ఎంచుకొని కరువు వ్యతిరేక పోరాట కమిటీ చేపట్టిన ఆందోళనలకు అచ్చులోని ప్రత్యక్షసాక్ష్యాలు ఈ కరపత్రాలు. కమిటీ ఎన్ని ఊర్లు తిరిగింది, ఎన్ని మారుమూల ప్రాంతాలలో ధర్నాలు నిర్వహించింది, కరువుకు గల ఎన్ని కారణాలను వెలికితీసి ప్రపంచం ముందు పెట్టింది, ఏ పరిష్కారాలను డిమాండ్లుగా ప్రభుత్వం ముందు పెట్టింది – ఈ కరపత్రాలు వ్యక్తం చేస్తాయి.

వెనకబాటుతనం బహుముఖం కాగా ఒక్క నీటిలేమి గురించే ఇంత చర్చ ఎందుకు, ఆందోళన ఎందుకు అన్న సందేహం కలగవచ్చు. కారణాలు చాలా ఉన్నాయి. కరువు లేకుంటే, నీటి లభ్యత తగినంత ఉంటే, ప్రభుత్వం ప్రత్యేకించి అభివృద్ధి చర్యలు చేపట్టకపోయినా కొంత అభివృద్ధి దానంతటదే వస్తుంది. వ్యవసాయ ఫలాల మిగులు కొంత మేరకయినా ఇతర రంగాలలోకి పోయి విభిన్న అవసరాలు తీర్చడానికి అవసరమైన మూలధనాన్ని కల్పిస్తుంది. ఈ అభివృద్ధి మార్కెట్ ఆధారితం కాబట్టి దీనిని అందరూ అందుకోలేరనేది సత్యమే. అయితే నీటిలేమి ఉన్నచోట ఆ మేరకు కూడ అభివృద్ధి ఉండదు. రెండవది, వెనుకబాటుతనంలోని

ఇతర లక్షణాలు ఎదుగుదలకు ఆటంకమేగానీ వాటంతటవే ప్రాణాంతకం కాదు. ఆకలి చావులు, బలవంతపు వలసలు, తీవ్ర పౌష్టికాహార లోపం, పిల్లలలో కుంటుపడే ఎదుగుదల – కరువు వికృత ఫలితాలు. అందువల్ల నీటి ఎద్దడి మీద ఎక్కువ దృష్టి పెట్టడం సహజం. మహబూబ్‌నగర్‌కు సంబంధించినంతవరకు ఈ నీటి ఎద్దడికి రెండు కారణాలున్నాయి. ఒకటి, పరిమితమైన వర్షపాతం ఇచ్చే నీటిని జాగ్రత్త చేయగల నీటివనరులను ఘోరంగా నిర్లక్ష్యం చేయడం. రెండు, జిల్లా మధ్యభాగాన, అంచున ప్రవహించే కృష్ణ, తుంగభద్ర నదుల జలాలలో ఈ జిల్లాకు ఉచితమైన వాటా కల్పించకపోవడం. ఇందులో మొదటిదాని కంటే రెండవదానిపైననే కరువు వ్యతిరేకపోరాటకమిటీ ఎక్కువ దృష్టిపెట్టిన విషయం ఈ ప్రచురణలోని కరపత్రాలు చదివితే అర్థం అవుతుంది. తమకు అందవలసిన నీటి వనరు వేరే ఎవరో తీసుకుపోతున్నారన్న ఆవేదన, ఇతర నీటి వనరులను అభివృద్ధి చేయడం లేదన్న ఆందోళనకంటే ఎక్కువ ఉండడం సహజమే. కొత్త ప్రాజెక్టుల మంజూరీ సంగతి అటుంచి, కట్టిన వాటి నిర్వహణ, మంజూరయినవాటి నిర్మాణం కూడ అలక్ష్యం పాలయ్యాయి. రాష్ట్రంలో స్వాంతంత్ర్యానికి పూర్వం కట్టిన ఆనకట్టలు బలహీనమయిపోయాయని ఒక్కొక్కటీ బాగు చేసుకుంటూ వచ్చారు. కృష్ణ, గోదావరి డెల్టాల ఆనకట్టలను పటిష్టం చేసారు. ఆ తరువాత కెసికెనాల్‌నూ చేసారు కానీ ఆ వరుసలో తదుపరి రావలసిన రాజోలిబండ డైవర్షన్ స్కీం (ఆర్‌డిఎస్) గురించి ఆనాడే కాదు, 2004లో 'జలయజ్ఞం' మొదలుపెట్టినప్పుడు సహితం ఆలోచించలేదు. నాలుగు సంవత్సరాల 'జలయజ్ఞం' తరువాతగానీ ఆర్‌డిఎస్ ఆధునీకరణ రాష్ట్ర ప్రభుత్వ అజెండాలోకి ఎక్కలేదు. బచావత్ అవార్డుద్వారా రాష్ట్రానికి మంజూరయిన ఏకైక కొత్త ప్రాజెక్టు జూరాల కాగా, దాని నిర్మాణం చాలా తీరికగా చేపట్టారు, ఇప్పటికీ పూర్తి స్థాయిలో చేయలేదు. కాలవల ఆధునీకరణ ద్వారా నీళ్లు ఆదా చేసామంటూ పులిచింతల, శ్రీశైలం కుడిగట్టు కాలవ, బీమా ప్రాజెక్టులకు కేంద్ర జలవనరుల సంఘం ఆమోదం పొందారు. శ్రీశైలం కుడిగట్టు కాలవను పూర్తి చేసేసారు. పులిచింతలను కూడ తెలంగాణ అభ్యంతరాల నడుమ దాదాపు పూర్తి చేసేసారు గానీ బీమా మాత్రం నత్తనడక నడుస్తున్నది. ఈ స్థితిలో నీటి ఎద్దడి గురించి చేసే ఆందోళనలో నదీజలాల ప్రాజెక్టుల ప్రస్తావన ప్రధాన స్థానంలో ఉండడం సహజం.

కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ప్రస్తావన ఆనాటి కరపత్రాలలో తరచుగా కనిపిస్తుంది. అది ఈ రోజు వాస్తవ రూపం తీసుకుంటున్నది. దానితోపాటు నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం కూడ నిర్మాణం అవుతున్నది. అయితే ఆనాడు వీటికోసం ఆందోళన చేసిన వారికి ఇది పూర్తి సంతృప్తినివ్వదు. ఎందుకంటె రెండూ మిగులు జలాల ప్రాజెక్టులుగానే కడుతున్నారు. అంతేకాదు, ఈ రెండు ప్రాజెక్టులతో సహా కృష్ణా జలాలపైన నిర్మిస్తున్న ఏ మిగులు జలాల ప్రాజెక్టుకూ నీటి హక్కు అడగబోమని రాష్ట్ర ప్రభుత్వం రెండవ కృష్ణా నదీజలాల ట్రిబ్యునల్‌కు హామీ ఇచ్చి వచ్చింది కూడ.

ఏం ఫరవాలేదని ప్రభుత్వం అంటుంది. దీనికోసం తాను తెలివయిన పథకం రచించినట్టు భావిస్తున్నది. మన రాష్ట్రవాటా అయిన కృష్ణా నది నికర జలాలలో 200 టిఎంసిలు కర్నాటక నుండి వస్తాయి. 200 టిఎంసిలు గోదావరి నుండి కృష్ణా బేసిన్‌కు తీసుకొచ్చి (80 ప్రకాశం బ్యారేజికి, 120 నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్‌కు), కర్నాటక నుండి కృష్ణానది ద్వారా వచ్చే 200 టిఎంసిలు నాగార్జునసాగర్‌కు ఎగువనే ఆపేసుకొని కృష్ణానదీ మిగులు జలాల ప్రాజెక్టులకు నికరజలాలు ఇయ్యవచ్చుననేది ఈ పథకం. వాస్తవాలు ఇంత సరళంగా ఉన్నట్టయితే నిజంగానే ఇది తెలివయిన పథకమే. కర్నాటక నుండి వచ్చే నీళ్ళు మొదట మహబూబ్‌నగర్ జిల్లాలోకి ప్రవేశిస్తాయి కాబట్టి ఈ పథకం వల్ల ఈ జిల్లాకే మొదటి ప్రయోజనం కూడ. కానీ

ఇందులో రెండు సమస్యలున్నాయి. గోదావరిలో నీళ్లు సాపేక్షంగా ఎక్కువ ఉన్నట్లనిపిస్తుంది గానీ గోదావరి పరీవాహక మట్టానికీ ఆ నదినీటిపైన ఆధారపడిన ఉత్తర తెలంగాణ భూముల మట్టానికీ మధ్యనున్న గణనీయమైన తేడావల్ల ఆ నదీజలాలలో మన రాష్ట్రవాటా పూర్తిగా వినియోగించుకోవడం చాలా ఖర్చుతో కూడిన విషయం. వినియోగించుకోగల మేరకు ఉత్తర తెలంగాణ జిల్లాల అవసరాలకు ప్రాముఖ్యం ఇవ్వాలేతప్ప కృష్ణా బేసిన్‌కు తరలించుకు పోవద్దన్న వాదన కొట్టిపారేయగలిగింది కాదు. రెండవది, గోదావరి బేసిన్ జలాలను ఆంధ్రప్రదేశ్ కృష్ణా బేసిన్‌కు తరలించినట్టయితే అందులో కర్ణాటక, మహారాష్ట్రలకు కూడ వాటా ఉంటుందని బచావత్ అవార్డులోనే ఉంది. కాబట్టి గోదావరి నుండి కృష్ణకు 200 టిఎంసిలు తరలిస్తే, కృష్ణలో ఎగువనుండి వచ్చే 200 టిఎంసిలలో పెద్ద భాగం ఎగువనే ఆ రాష్ట్రాలు నిలిపేసుకోవచ్చు. వరదనీరు బాగున్న సంవత్సరాలలో ఈ తేడా కనిపించకపోవచ్చును గానీ వర్షాభావ సంవత్సరాలలో కనిపిస్తుంది. మిగులు జలాల ప్రాజెక్టులు నీటికి ఎండడం, వాటిపైన ఆధారపడ్డ ప్రజలు ఘర్షించుకోవడం జరుగుతుంది. ఏ రకంగా చూసినా కృష్ణానదీజలాల కేటాయింపునూ, భరోసానూ కూడ పునఃపంపిణీ చేయడమొక్కటే హేతుబద్ధమైన పరిష్కారం. కానీ మన రాష్ట్ర ప్రభుత్వం దానికి ఎంతమాత్రం సిద్ధంగా లేదు.

నదీజలాలతోపాటు ఈ ప్రచురణలోని కరపత్రాలలో తరచుగా వినిపించేది వలసబతుకుల దైన్యం. మహబూబ్‌నగర్ జిల్లా ఒక్క మన రాష్ట్రంలోనే కాదు, దేశమంతటా వలసల విషయంలో పేరుపడింది. జనాభాలో మూడవవంతు 'జానెడు పొట్టకోసం, మూరెడు బట్టకోసం దిక్కుల చివరిదాకా' వలసపోయే జిల్లా ఇది. ఎప్పుడయినా ఎక్కడయినా అసంఘటిత కార్మికుల హక్కులకు గుర్తింపు, రక్షణ కరువన్నది సత్యంకాగా, వలస కార్మికుల పరిస్థితి మరీ అధ్వాన్నం. వారు పనిచేసే ప్రతి చోటా పరాయివారే. తరచుగా స్థానిక భాష సహితం వారికి పరాయిభాషే. కట్టుబానిసలుగా వచ్చి కట్టు బానిసలుగా పనిచేసి ప్రాణం మిగిలిఉంటే పని అయినాక వెనక్కి పోతారు. ఊరినుండి తీసుకుపోయిన మేస్త్రీ, పరాయి ప్రాంతంలో పని చేయించుకునే కాంట్రాక్టర్, తమకు కూలి ఇయ్యకపోయినా తిండి పెట్టకపోయినా శారీరకంగా హింసించినా రోగమొచ్చినా రొష్టు వచ్చినా పట్టించుకోకపోయినా ఎవరికీ ఫిర్యాదు చేసుకోలేరు, న్యాయం పొందలేరు. అంతర్‌రాష్ట్ర వలస కార్మికుల చట్టం అనేదొకటి ఉన్నా, అందులో వలస కార్మికుల హక్కులకు కొంత రక్షణ కల్పించే అంశాలున్నా, ఆ చట్టం అమలు ఇతర కార్మిక చట్టాలకంటె కూడ అధ్వాన్నంగా ఉంది.

ఏకరవు పెట్టుకుంటూ పోతే కరువుకు చాలా పార్శ్వాలున్నాయి. స్త్రీలు, పిల్లలు, దళిత కులాలు అనుభవించే అణచివేతకూ కరువు పార్శ్వం ఉంటుంది. అవన్నీ సవివరంగా కరువు వ్యతిరేక పోరాట కమిటీ తన కరపత్రాల ద్వారా ప్రచారంలో పెట్టిన డిమాండ్లలో కనిపిస్తాయి. ఇతర కరువు ప్రాంతాలలో జరుగుతున్న, జరగవలసిన ఆందోళనలకు ఈ కృషి మార్గదర్శకంగా ఉండగలదు. ప్రాంతాన్నిబట్టి, పరిస్థితులలో స్థానికంగా ఉండే తేడాను బట్టి, ఫిర్యాదులలోనూ పరిష్కారాలలోనూ కొంత వైవిధ్యం ఉండవచ్చును గానీ కరువుకు వ్యతిరేకంగా చేపట్టే ఆందోళన ఎంత వివరంగా అధ్యయనం చేయాలి, ఎంత లోతుగా పరిశీలన చేయాలి, ఎన్ని జీవిత పార్శ్వాలను తాకే డిమాండ్లనూ సూచనలనూ ప్రభుత్వం ముందు, సమాజం ముందు పెట్టాలి అన్నదానికొక మంచి ఉదాహరణగా మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన ఈ కృషి నిలిచిపోతుంది. దానికి అద్దంపట్టే ఈ ప్రచురణ తీసుకొచ్చినందుకు కరువు వ్యతిరేక పోరాట కమిటీకి అభినందనలు.

కె. బాలగోపాల్